# సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయాలనే కాదు;

# రైతు కష్టాన్ని సైతం గుర్తించని 'రైతు బంధు పథకం'

***

*తెలంగాణా రాష్ట్రప్రభుత్వం రైతుబంధుపథకం, తెలుగు రాష్ట్రాలలోనేకాక యావద్దేశంలోనే గొప్ప పథకమంటూ కోట్ల రూపాయలు ఖర్చుచేసి విస్తృత ప్రచారం చేసుకుంటోంది. వివిధ ప్రజాసంఘాలు, రైతుసంఘాలు ఈ పథకం రియల్ ఎస్టేట్ వ్యాపారులకీ, గైర్హాజరీ భూస్వాములకే మేలు కలిగిస్తుందని చెబుతున్నారు. తెలంగాణా రైతుకూలీసంఘం ఈ అంశంపై కరపత్రం ముద్రించి, ఈ పథకం స్వభావాన్ని వివరించింది. రైతుకు పంట సాయంక్రింద ఎకరాకు పంటకు రూ.4 వేలు ప్రభుత్వం ఇస్తుంటే, తామెందుకు ఇంకా పంట రుణాలివ్వాలని బ్యాంకులు జూన్ నెలగడుస్తున్నా రైతులకు రుణాలివ్వలేదు. ఇలాంటి స్థితిలో రైతుబంధు పథకం వెనుక రాజకీయ ఉద్దేశ్యాన్ని అర్థంచేసుకోవలసి వుంది. – సంపాదకుడు*

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మే 10వ తేదీ నుండి రైతు బంధు పథకం ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది.భూమి రికార్డుల ప్రక్షాళన, కొత్త పాసుపుస్తకాల పంపకం, రైతుకు పెట్టుబడి సాయం దీనిలోని అంశాలు.

రాష్ట్రంలోని మొత్తం భూమి 1 కోటి 40 లక్షల 98 వేల 448 ఎకరాలుగా సర్వేలలో తేల్చిన ప్రభుత్వం దానిలో సాగుదారులందరికీ పెట్టుబడి సాయం కింద ఎకరానికి పంటకు 4 వేల రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ ప్రకటనల ప్రకారం మొత్తం 57.33 లక్షల పాసు పుస్తకాలను మే 20 నాటికి రైతులకు పంపకం చేయాలని పూనుకొన్నారు. అయితే మే 20 నాటికి 44 లక్షల పాసుపుస్తకాలే పంపకం అయ్యాయి. తెలంగాణలో ఒక గుంట (అంటే 2.5సెంట్లు అంటే ఎకరానికి 40 గుంటల)కి 100 రూ॥ల చొప్పున ఒక పంటకు పంట సాయం లెక్కించారు. ఆ ప్రకారం ఒక గుంట నుంచి 2.5 ఎకరాల వరకూ ఉన్న రైతులు 40 లక్షల 92 వేల మంది. అంటే వారు తమ తమ భూముల విస్తీర్ణం అనుసరించి 100 రూ॥ల మొదలు 10 వేల వరకూ పంట సాయం పొందుతారు. రైతుల పైస్థాయి వారు 6500 మంది కేవలం25 ఎకరాలు ఆ పైన ఉన్న వారు ఉన్నారు. వీరు లక్ష రూపాయలు ఆపైన సహాయం పొందుతారు. ఆ విధంగా భూస్వామ్య, ధనిక రైతాంగం ఎక్కువ ప్రయోజనం పొంద గలుగుతుంది.

పట్టా పాసుపుస్తకాలతో పాటు చెక్కుల పంపిణీ కూడా జరిగింది. అయితే మే 20 చివరి గడువు అనుకొన్నా సుమారు 58 లక్షల పాసుపుస్తకాలు, చెక్కుబుక్కులకుగాను 44 లక్షల పుస్తకాలు, చెక్కులే పంపిణీ జరిగాయి. ఫొటోలు తేడాల వల్ల 3 లక్షల పాసుపుస్తకాలు, సర్వే నెంబర్లు, పేర్లు తదితర తేడాలను అధికారులు గుర్తించిన చోట మరో 7 లక్షల పుస్తకాలు మొత్తం 10 లక్షల పాసుపుస్తకాలు, చెక్కుల పంపిణీ జరగలేదు. ఇచ్చిన 44 లక్షల చెక్కులలో మే 20 నాటికి 17 లక్షల చెక్కులే మార్పిడికి బ్యాంకులకు చేరాయి. వాటిలో చిన్న తేడాలు (సర్వేనెంబర్లు మొదలగునవి) ఉండగా చెక్కులు మార్చుకొంటే అవే ఖరారు అవుతాయనే అనుమానంతో వాటిలో సవరణల కోసం రైతాంగం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

రైతు బంధు పథకం తెలంగాణ రాష్ట్రంలోని రైతులలో ముఖ్యభాగమైన కౌలు దారులను పూర్తిగా విస్మరించింది. మొత్తం తెలంగాణలో సుమారు 15 లక్షల మంది కౌలుదారులైన రైతులున్నారు. 2014లో తెలంగాణ ఏర్పడిన నాటి నుండి ఆత్మహత్యకు చేసుకొన్న సుమారు 3,600 రైతులలో 70 శాతం మంది కౌలుదారులైన రైతులే. వీరిని విస్మరించడం అంటే సామాజిక న్యాయాన్ని విస్మరించడం. 2011లో లైసెన్స్‌డ్ కల్టివేటర్ యాక్ట్ కింద కౌలుదారులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని ఉంది. అయినా అది అమలు కాలేదు.

రైతు బంధు పథకం విస్మరించిన మరో విభాగం ఆదివాసులు. ఆదివాసుల సాగులోని అనేక భూ ఖండాలు సర్వే రికార్డులలోనే లేవు. సర్వే జరగనందున వాటికి పట్టాలు ఉండవు కనుక అత్యధిక ఆదివాసీ ప్రజలు ఈ పథకం బయటనే ఉన్నారు.

ఈ విషయంలో మరింతగా తరచి చూస్తే మౌలిక అంశాలు కనిపిస్తాయి. నాటి నైజాం కాలం నుంచి నేటి వరకూ భూ పోరాటం జరగని ప్రాంతం తెలంగాణలోనే కాదు. తొత్తులకు, బడితొత్తులుగా బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు నిజాం, నిజాంకి దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు ఇలా ప్రజా పీడకుల దొంతర రైతుల మూపుల మీద స్వారీ చేసేది. భూమి కోసం సాగినదే మహత్తర తెలంగాణా రైతాంగ పోరాటం. ఆ పోరాటాన్ని క్రూరంగా అణచి భూస్వాములను తిరిగి తెచ్చినప్పటికీ 1950ల నుండి పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణ కోసం రైతు కూలీలు ఉద్యమించుతూనే వచ్చారు. 1960–70ల నాటి వరంగల్, నల్గొండ జిల్లాలో రైతు కూలీలను బేధకల్ చేయడానికి పాలకులు అనుసరించిన బీభత్సం తర్వాత కూడా భూపోరాటాలు సాగాయి. 1980ల తర్వాత ఇంద్రవెల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల పోరాటాలు వేల ఎకరాల భూమి సమస్యలను ముందుకు తెచ్చాయి.

ఈ రైతు బంధు పథకం నాడు పోరాటాలు లేవనెత్తిన మౌలిక సమస్యలను పరిష్కరించలేదు. పట్టాలు కలిగి ఉన్న వారిని వారు ఆ పట్టాలు ఎలా కలిగి ఉన్నారన్న దానితో సంబంధం లేకుండా చట్టబద్ధం చేయడమే ఈ రైతు బంధు అసలు ఉద్దేశ్యం.

1944కి ముందు ఆదిలాబాద్ జిల్లాలో నాటి నైజం ప్రభుత్వమే గిరిజనుల సాగు భూములను ఎక్కువ పన్నులు ఇచ్చే పేరిట మైదాన ప్రాంత దోపిడీ శక్తులకు ఆహ్వానం పలికింది. అధికారులు 'జల్సాపట్టి' పేరుతో అదనంగా తీసుకొని విశాల ఏజెన్సీ భూములను మైదాన ప్రాంత భూస్వాముల పరం చేశారు. కొమరం భీం తిరుగుబాటుకు నేపథ్యం ఇది. ప్రభుత్వాల సర్వే ప్రకారం ఖమ్మం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో 52 శాతం భూమి, ఆదిలాబాద్‌లో 60 శాతం భూమి, వరంగల్ జిల్లాలో 71 శాతం భూమి

గిరిజనుల నుంచి దూరం చేయబడింది. 1989లో రిజర్వ్ ఆఫ్ రైట్స్ యాక్ట్ పేరుతో వీటిని చట్టబద్ధం చేసే ప్రయత్నం జరిగింది. ఈ సమస్యలను 2006లో గ్లిర్‌గ్లనీ కమిటీ నిర్ధారించింది. ఈ అక్రమాలను పరాయికరణను చట్టబద్ధం చేయడమే నేటి 'రైతు బంధు' పథకం వెనుక అసలు ఉద్దేశ్యం.

తెలంగాణాలో లక్ష ఎకరాల ఈనాం భూమి ఇంకా సక్రమంగా నిర్ధారించబడలేదు. పాత ఖమ్మం జిల్లాలో సుమారు 82 వేల ఎకరాలు, పాత వరంగల్ జిల్లాలో 37 వేల ఎకరాలు, ఇలా ప్రతి చోట వేల ఎకరాల ప్రభుత్వ భూమి పెత్తందార్ల, భూస్వాముల పరం అయింది. చేతులు మారింది. దీని కోసం తెల్ల కాగితాల మీద క్రయవిక్రయాలు జరిగాయి. ఇపుడది అంతా చట్టబద్ధం అవబోతున్నది.

తెలంగాణాలో తెల్లకాగితాలపై అమ్మకం జరగడాన్ని 'సాదా బైనామా' అంటారు. 2014 తర్వాత టిఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 153 విడుదల చేసి సాదా బైనామా కింద 5 ఎకరాల వరకూ క్రమబద్ధీకరించే అవకాశం ఇస్తూ 2014కి ముందు జరిగిన 'సాదా బైనామా'ని చెల్లుబాటు చేసుకోవచ్చని చెపుతూ కలెక్టర్లకు అధికారాలు ఇచ్చింది. ఆ విధంగా 15 లక్షల 61 వేల సర్వే నెంబర్లపై 11 లక్షల 17 వేల దరఖాస్తులు ప్రభుత్వం ముందుకు వచ్చాయి. పెత్తందార్లు, నోరుగల వాళ్లు దీన్ని ఉపయో గించుకొన్నారు. గతంలో అమ్మకాలు చేసిన వారు చనిపోయి, వారి వారసులు అడ్డం తిరిగిన చోట సమస్యలు ఏర్పడ్డాయి. అవి ఆత్మహత్యల వరకూ వెళ్ళాయి రెవెన్యూ యంత్రాంగం మీద పట్టుగల వారు వీటన్నిటినీ చక్కబెట్టగలుగుతారు.

కనుక తెలంగాణ సాయుధ పోరాటకాలం నుంచి మౌలిక భూ సమస్యలను చట్టపర పద్ధతులలో మరుగుపరచడమే నేటి రైతు బంధు పథకం అసలు ప్రయోజనం. ఇది సామాజిక సమానత్వాన్ని సాంఘిక న్యాయాన్ని అందించేది కాదు. చివరకు ప్రతి ఎకరానికి రైతుకి పెరుగుతున్న ఖర్చులకు ఇచ్చే 4 వేల రూపాయలు కూడా ఏ మాత్రం సరిపోదు. రైతులు కోరుతోంది పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధర. దీన్ని కల్పించాలంటే దళారీ మార్కెట్ శక్తులను అదుపు చేయాలి. ప్రభుత్వాలు ఆ పని చేయదలచుకోవడం లేదు. ఉపశమన చర్యలతో అసలు సమస్యలనుండి రైతులను జోకొట్టదలచుకొన్నారు. గైర్హాజరు భూస్వాములకు లక్షలు లక్షలు అప్పగించదలచు కొన్నారు. లోతుగా చూస్తే రైతు బంధు సారాంశం ఇది.

ooooo